సకాలంలో పన్నులు చెల్లించాలి

మేడ్చల్ డీటీఓగా ఎం.రఘునందన్‌గౌడ్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20: వాహనాల నుంచి రవాణాశాఖకు రావాల్సిన పన్నులు సకాలంలో చెల్లించి పెండింగ్ లేకుండా చూసుకోవాలని.. లేనిపక్షంలో వాహనాల తనిఖీల్లో పట్టుబడితే శాఖాపరమైన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా రవాణాశాఖాధికారి జి.రఘునందన్‌గౌడ్ సూచించారు. ఇటీవల నూతనంగా మేడ్చల్ జిల్లా రవాణాశాఖాధికారిగా బాధ్యతలను చేపట్టిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మేడ్చల్ జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 21 లక్షల ఆయా విభాగాల వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 2023 సంవత్సరానికి గాను 85 శాతం పన్నుల రూపంలో వసూలు చేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న వాహనదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, మొండి బకాయిదారులకు పన్నులపై అదనంగా 200 శాతం చెల్లించాల్సి ఉందన్నారు. కూకట్‌పల్లి ఆర్‌టీఓ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని, దానికి ప్రత్యేకంగా శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేకంగా వాహనాలను స్క్రాబ్ చేసుకునే వారు నేరుగా రవాణా శాఖ అధికారులను సంప్రదించి, వాహనాలకు ప్రస్తుతం ఉన్న నంబర్‌ను తొలగించేందుకు ఆస్కారం ఉంటుందని, దీని ఫలితంగా భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. దీనికి తోడు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేందుకు బాధ్యతతో ఉండాలని వాహనదారులకు సూచించారు. త్వరలోనే జిల్లా ఆర్‌టీఓ కార్యాలయం ఆవరణలో ప్రత్యేకంగా ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమ నిబంధనలపై ఎలక్ట్రానిక్ డిస్ప్లే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అభివృద్ధికి అండగా నిలుస్తా..

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, ఫిబ్రవరి 20: రాజకీయాలకు అతీతంగా ప్రజల తోడ్పాటుతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందానని.. కాలనీల అభివృద్ధిని అండగా ఉంటానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. ఆల్విన్ కాలనీ డివిజన్ తులసీ నగర్, హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడ సాయి కృప అపార్ట్‌మెంట్‌కు నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంఘాల ప్రతినిధులను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది నిధులు వెచ్చించి విస్తృత స్థాయిలో మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. కాలనీల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి అనుగుణంగా నిధుల మంజూరు కోసం ప్రభుత్వంతో పోరాడుతానని, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తానని పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధితో పాటు సామాజిక కార్యక్రమాల్లో కాలనీ ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్‌రావు, రామకృష్ణ, మధు, సురేశ్‌బాబు, కృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు, అజయ్‌కుమార్, రవిచంద్ర, వంశీకృష్ణ, వినయ్, హన్మంతరావు, సత్యనారాయణరావు, బలవంతరెడ్డి, ఆనందరావు పాల్గొన్నారు.

తులసీనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



పాపిరెడ్డి కాలనీ వీరాంజనేయ దేవాలయ వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ

ప్రత్యేక పూజలు..

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డికాలనీ నగర్ వీరాంజనేయ దేవస్థానం 17వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సంజీవరెడ్డి శ్రీనివాస్, పెద్ద భాస్కర్‌రావు, చంద్రారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ధర్మారావు, భగవంతురెడ్డి, నర్సింహులు, అనంతరాములు, రామకృష్ణ, కాశీనాథ్, ఎల్లం నాయుడు, శ్రీనివాస్ తదితరులున్నారు.

సిబ్బందినైనా పెంచండి.. యంత్రాలన్నా వాడండి

మియాపూర్, ఫిబ్రవరి 20: నానాటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచి పారిశుధ్య పరిస్థితులను మరింతగా మెరుగు పరచాలని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కోరారు. లేని పక్షంలో శివారు మున్సిపాలిటీల్లో అవలంభిస్తున్న విధంగా యంత్రాలు పెంచుకోవాలని సూచించారు. బల్దియా కౌన్సిల్ సమావేశంలో భాగంగా చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్‌లకు చెందిన పారిశుధ్య పరిస్థితులపై మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్ మంగళవారం మాట్లాడారు. 2009 నాటి జనాభా ప్రాతిపదికన పారిశుధ్య సిబ్బందిని కొనసాగిస్తుండటంతో పెరిగిన జనాభా అవసరాలకు తగ్గట్టుగా మెరుగు పడటం లేదన్నారు. సర్కిల్ పరిధిలో సుమారు 536 మంది పారిశుధ్య సిబ్బందికి గాను వివిధ కారణాలతో రోజువారీగా గరిష్టంగా 270 సంఖ్యకు మించి విధులకు రావటం లేదన్నారు. దీంతో పనిభారం అధికమై పారిశుధ్యం పడకేస్తుందన్నారు. శివారు మున్సిపాలిటీల్లో అవలంభిస్తున్నట్లుగా యంత్రాల వినియోగాన్ని మిత వ్యయంతో పెంచుకోవాలని సూచించారు. మియాపూర్‌లోని డంప్ యార్డులో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడ తీసుకొస్తున్న కెమికల్, మెడికల్ వేస్టేజీని రాంకీ సంస్థ అనధికారింగా సెగ్రిగేషన్ చేస్తున్నదని, తద్వారా పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నదన్నారు. తక్షణమే అనధికారికంగా చేస్తున్న ఈ ప్రక్రియను ఉన్న తాధికారులు నిలిపివేయాలని కౌన్సిల్‌లో కార్పొరేటర్ శ్రీకాంత్ ప్రస్తావించారు.

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

పెండింగ్ జీతాలు ఇవ్వాలని వినతి

అల్లాపూర్, ఫిబ్రవరి 20: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల మూడు నెలల పెండింగ్ జీతాలు, బిల్లులు చెల్లించాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మంగళవారం సీడీపీవో కూత్బుల్లాపూర్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.

మెరుగైన పారిశుధ్య నిర్వహణే లక్ష్యం

సమీక్షాసమావేశంలో నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి

దుండిగల్, ఫిబ్రవరి 20: మెరుగైన పారిశుధ్య నిర్వహణే లక్ష్యంగా కార్మికులు పనిచేయాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రగతినగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ రామకృష్ణారావుతో కలిసి పెండింగ్, అభివృద్ధి పనులపై మేయర్ సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు పెండింగ్ పనులను పునఃప్రారంభించాలని సూచించారు. రోడ్డు పక్కన ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు క్లియర్ చేయాలని, తోపుడు బండ్లు రోడ్డు మీదికి రాకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వీధికుక్కల బెడదను నియంత్రించడంతో పాటు ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ఉన్న నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌ల శానిటేషన్ సూపర్‌వైజర్లను సమావేశానికి రప్పించి శానిటేషన్ నిర్వహణ విషయంలో నిక్కచ్చిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షాసమావేశంలో పాల్గొన్న మేయర్ నీలాగోపాల్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు తదితరులు

ప్రత్యేక పూజలు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలోని శివాలయం వద్ద జరిగిన ఆంజనేయస్వామి విగ్రహం పునఃప్రతిష్ఠలో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

దుండిగల్, ఫిబ్రవరి 20: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తెలిపారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు కలిసి స్థానిక సమస్యలు పరిష్కరించడంతో పాటు.. మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రాలు అందజేశారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

దుండిగల్, ఫిబ్రవరి 20: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులోని చర్చిగాగిళ్లాపూర్ సర్వేనంబర్ 214 కాలనీలో రూ.45లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ, రూ.8లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కౌన్సిలర్ జోస్ఫన్ సుధాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ శంకర్ నాయక్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, కరీమా తదితరులు పాల్గొన్నారు.

చర్చిగాగిళ్లాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు శంభీపూర్‌కృష్ణ, జోస్ఫిన్ సుధాకర్‌రెడ్డి తదితరులు

రక్తదానం అభినందనీయం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 20 : విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమని కళాశాల చైర్మన్ గొట్టిముక్కల భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాల, ఆయుష్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన కళాశాల చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండడం సంతోషకరమన్నారు. కష్టకాలంలో రోగులకు ఉపయోగపడే రక్తాన్ని విద్యార్థులు ఉచితంగా ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మధుసూదన్‌రావు, అరవింద్‌రావు, ప్రిన్సిపాల్ ఎ.పద్మప్రియ, ఎన్.చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

కూకట్‌పల్లి సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో రక్తదాన శిబిరంలో చైర్మన్ భాస్కర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

అల్లాపూర్, ఫిబ్రవరి 20: మోతీనగర్ పరిధిలోని పాండురంగానగర్ ప్రన్నవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని షిర్డీ సాయిబాబా ఆలయం 22వ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కాగడ హారతి, శతకటాభిషేకం, అలంకరణ, అర్చన, సామూహిక సత్యనారాణ ప్రతాలతో పాటు మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి నాయకుడు గోపిశెట్టి నిరంజన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణ, ఆలయ చైర్మెన్ వీఏవీ సత్యనారాణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా ఆలయం వార్షికోత్సవం

పాపిరెడ్డినగర్ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో కాంగ్రెస్ పార్టీ నేత వెంకటేశ్వర్‌రావు, భక్తులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 20 : కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని శ్రీవీరాంజనేయస్వామి–శివాలయం 17వ వార్షికోత్సవ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేసిరెడ్డి హన్మంతరెడ్డి, కాలనీ అధ్యక్షుడు ఉట్ల చంద్రారెడ్డి, ధర్మారావు, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఆంజనేయులు, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో పూడిక తీయించాలని వినతి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20: నాలాల్లో పేరుకుపోయిన చెత్త, పూడికను సకాలంలో తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీవాసులు స్థానిక మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ ప్రాంతానికి చెందిన అరకల వంశీ(25) ఈనెల 18న కొంపల్లి నుంచి తూప్రాన్‌కు తన ద్విచక్ర వాహనంపై రాత్రి సమయంలో వెళ్తున్న సమయంలో మార్గమధ్యలోని కొంపల్లి బ్రిడ్జి దాటిన తర్వాత జీవీకే మాల్ సమీపంలో ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ క్రమంలో తలకు బలమైన గాయం కావడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

కొండాపూర్, ఫిబ్రవరి 20 : చందానగర్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ డివిజన్ కార్పొరేటర్ మంజులారఘునాథ రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనులకు వెంటనే నిధులను మంజూరు చేయడంతో పాటు పీజేఆర్ స్టేడియంలో పలు క్రీడలకు కోచ్‌లను నియమించి, క్రీడా ప్రాంగణాలకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చందానగర్ – అమీన్‌పూర్ రోడ్డులో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయిందని, వెంటనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాల్సిందిగా కోరారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మంజులారెడ్డి

బాలుడి అదృశ్యం

కొండాపూర్, ఫిబ్రవరి 20 : బాలుడు అదృశ్యమైన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి వెంకట్ రెడ్డి కాలనీలో నివాసం ఉండే పొన్నం కుమార స్వామి రెండో కుమారుడు సాత్విక్ గౌడ్(14), స్థానికంగా ఓ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా సోమవారం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన సాత్విక్ సాయంత్రం 7:35 గంటలకు బయటకు వెళ్లి ఎంతకీ తిరిగిరాలేదు. తెలిసిన వారిని, చుట్టు పక్కల వారిని ఆరాతీసిన ఎలాంటి సమాచారం లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ మేరకు కుమార స్వామి ఫిర్యాదును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాత్విక్ (ఫైల్)

ముగిసిన రేణుకా ఎల్లమ్మ జాతర



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ఆలయకమిటీ సభ్యులు

దుండిగల్, ఫిబ్రవరి 20: గాజులరామారంలోని చిత్తారమ్మదేవి ఆలయ ప్రాంగణంలోని రేణుకా ఎల్లమ్మ జాతర మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం నుండే భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగిన జాతరలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయకమిటీ సభ్యులు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావులశేషగిరిరావు, ఆలయ కమిటీ సభ్యులు సహదేవ్, రవి, నర్సింగ్‌రావు, సురేశ్, రాజుతో పాటు ఎంవీ.మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20: జగద్గిరిగుట్ట లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం 53వ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం హుండీ లెక్కించారు. తైబజార్, స్వామివారి కట్నాలు, హుండీ ఆదాయం, ఇతర ఆదాయాల ద్వారా మొత్తం రూ.8,51,108 ఆదాయం వచ్చిన్నట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, ధర్మకర్తలు గుజ్జల పాపిరెడ్డి, ఆర్.ప్రవీణ్‌కుమార్ గుప్తా, పి.సమ్మయ్య యాదవ్, అనితామహేందర్, పి.మహేశ్‌కుమార్ యాదవ్, ఈ.వెంకటేశ్‌తో దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి వీవీ.సుబ్రహ్మణ్యం, ఈఓ కృష్ణమాచార్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

జీడిమెట్ల, ఫిబ్రవరి 20: ఈనెల 8న సుభాష్‌నగర్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు కేసు వివరాలను వెల్లడించారు. సుభాష్‌నగర్‌కు చెందిన మహమ్మద్ యాసిన్ బేగ్ (48) స్థానికంగా పాన్ షాపు నిర్వహించే వాడు. ఓ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన యాసీన్ బేగ్ పాన్ షాపును అమ్ముకొని కూలీ పనులు చేస్తున్నాడు. కొంత కాలంగా యాసిన్ బేగ్ మద్యానికి బానిసవ్వడంతో భార్య పిల్లలు అతడిని వదిలి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఒక్కడే సుభాష్‌నగర్ మార్కెట్ ప్రాంతంలో అద్దె గదిలో ఉంటున్నాడు. యాసిన్ బేగ్ గది పక్కనే ఉన్న ఫేక్ ఖాన్ యాసిన్ బేగ్ వద్ద చిన్న మొత్తాన్ని అప్పుగా తీసుకున్నాడు. ఈనెల 8న యాసిన్‌బేగ్ తన గదిలో మరో స్నేహితుడు రావూఫ్‌తో కలిసి మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో వారి వద్దకు ఫేక్ ఖాన్ సైతం వచ్చాడు. యాసిన్ బేగ్, ఫేక్ ఖాన్‌ల మధ్య డబ్బుల విషయంలో గొడవ జరుగుతుండటంతో రావూఫ్ అక్కడి నుంచి లేచి వెళ్లిపోయాడు. గొడవ తీవ్రం కావడంతో యాసిన్ బేగ్ తన గదిలో ఉన్న రంపం బ్లేడుతో కొట్టేందుకు ప్రయత్నించగా ఫేక్ ఖాన్ రంపం లాక్కోని యాసిన్ బేగ్ మేడ, ముఖంపై తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనలో యాసిన్ బేగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. 11వ తేదీన ఫేక్ ఖాన్ పశ్చిమ బెంగాల్‌కు పారిపోయాడు. అదే రోజు రాత్రి గది నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హత్య కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక ఆధారాలు సేకరించి ఫేక్ ఖాన్‌ను నిందితుడిగా గుర్తించారు. పశ్చిమ బెంగాల్‌కు ఎస్ఐ హరీశ్ ఆధ్వర్యంలో వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నిందితుడు ఫేక్ ఖాన్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జీడిమెట్ల సీఐ శ్రీనివాస్ రావు, ఎస్ఐ హరీశ్, కానిస్టేబుల్ ప్రభాకర్‌లను ఏసీపీ అభినందించారు.

హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న బాలానగర్ ఏసీపీ హనుమంతరావు

PUBLIC NOTICE

General Public are hereby informed that my client **M/s. DIYAVI BUILDERS & DEVELOPERS, represented by Mr. D.SASIKANTH, S/o. D. Krishna Reddy**, Occ: Business, R/o. Plot No. 534, Vivekananda Nagar Colony, Kukatpally, Hyd, T.S.-72, has Lost his Original Link Regd. AGPA Doc No. **3407/2009**, dated **14-05-2009,** Regd. at SRO, Quthbullapur, while travelling from Nizampet to Kukatpally, on dated: 04-02-2024, Assiduous efforts of my Client Proved futile, Thereupon my Client filed a complaint in Kukatpally Police Station.

In case any person found or in possession of the above said Regd. Link AGPA may please handover to my client on to my address given below.

Sd/- C. Subba Rao, Advocate
Dharma Reddy Colony, Ph-I,
LIG-76, KPHB, Kukatpally,
Hyderabad-500 072, T.S.
Cell: 9391170066

ప్రతి విషయాన్ని పరిశీలించే జ్ఞానం పెంచుకోవాలి

జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న రవీందర్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్, శ్రీనివాసాచారి తదితరులు

ఎంఈవో ఆంజనేయులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 20 : విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రతి విషయాన్ని పరిశీలించే జ్ఞానాన్ని పెంచుకుంటే సైన్స్‌పై అభిరుచిని పెరుగుతుందని కూకట్‌పల్లి మండల ఎంఈవో ఆంజనేయులు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో మేడ్చల్ జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొనగా ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మొదటి స్థానంలో జడ్పీహెచ్ఎస్ బోడుప్పల్‌కు చెందిన అక్షయ్ కుమార్ ద్వితీయస్థానంలో జడ్పీహెచ్ఎస్ హైదర్‌నగర్‌కు చెందిన శివచరణ్ తృతీయస్థానంలో శంషీగూడకు చెందిన హర్షిత్‌కుమార్ ఎంపికయ్యారు. వీరు సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 28న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. భారదేశంలో ఎందరో శాస్త్రవేత్తలు గొప్పగొప్ప ప్రయోగాలు చేశారని.. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు సైన్స్‌పై మక్కువను పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు, సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్, శ్రీనివాసాచారి, అజయ్‌సింగ్, కవిత, గురవాచారి, టి.ఎల్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం...

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 20: విదేశాల్లో ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామని.. లక్షల్లో డబ్బులు వసులు చేసిన ఇద్దరు ఏజెంట్‌లను కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వెంకన్న తెలిపిన ప్రకారం పచ్చిమ గోదావరికి చెందిన గంటా అనిల్‌కుమార్, గంటా సునీల్ కుమార్ ఇద్దరు సోదరులు. ఆగస్టు 2022లో అనిల్‌కుమార్ మాల్టా దేశంలో ఫస్ట్ ఎంప్లాయిమెంట్ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ పేరుతో రిక్రూట్‌మెంట్ ఏజెన్సీని ప్రారంభించి.. పలువురు ఉద్యోగాలు పొందే ప్రాసెస్‌ను విజయవంతంగా నిర్వహించాడు. తర్వాత తన సోదరుడు సునీల్‌కుమార్‌తో కలిసి డైరెక్టర్లుగా కేపీహెచ్‌బీ కాలనీలోని 6వ ఫేజ్‌లో అబ్రాడ్ స్టడీ ప్లాన్ పేరుతో కన్సల్టెన్సీని ప్రారంభించారు. యూట్యూబ్ చానల్‌లలో వీడియోలను పెట్టి విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు, ఉద్యోగాలు పొందాలనుకునే వారిని ఆకర్షిస్తారు. ఈ క్రమంలో మెహదీపట్నంకు చెందిన ఇద్రిస్‌ను యూరప్ దేశానికి పంపించడం కోసం రూ.5 లక్షలు వసూలు చేశార